ప్రత్యేక చట్టం తీసుకురావాలి



ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటళ్ల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి. కఠినంగా శిక్షలు అమలు చేయాలి. అప్పుడే కోలకతా లాంటి ఘటనలు జరగకుండా ఉంటాయి. ప్రతి హాస్పిటల్‌కు ఒక కమిటీ ఏర్పాటు చేయాలి. కమిటీ సభ్యులు అందుబాటులో ఉంటూ పరిస్థితులను పర్యవేక్షిస్తుంటే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి.

– డాక్టర్ జగన్ నరసింహారెడ్డి, వైద్యులు, నరసరావుపేట



దోషులను కఠినంగా శిక్షించాలి



కోలకతాలో యువ వైద్యురాలిపై లైంగిక దాడి, హత్య చాలా దారుణం. విధి నిర్వాహణలో ఉన్న దాక్టర్లపై ఇటువంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలి. దీంతో పాటు న్యాయస్థానాలపై నమ్మకం ఉండే విధంగా దోషులకు తగిన తీర్పుతో బుద్ధి చెప్పాలి.

–డాక్టర్ శిరీష, ఎండీ, డీఎం, నరసరావుపేట

క్లుప్తంగా

200 మందికి వైద్య పరీక్షలు



నాదెండ్ల: యడ్లపాడు అభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రంలో ఉచిత బీపీ, షుగర్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. డాక్టర్ లింగమల్లు భాస్కరరావు, గుంటుపల్లి భవ్యతేజ, కొంతినేని నవ్యశ్రీ పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో 250 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి, రెండు నెలలకు సరిపడా మందులు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ప్రతిరోజూ కనీసం అరగంట పాటు నడవాలని, యోగా, శారీరక వ్యాయామం చేయాలని సూచించారు. పోషకాలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవాలన్నారు.

దుప్పట్లు, విద్యా సామగ్రి పంపిణీ



చిలకలూరిపేట: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు గట్టు సరోజిని పేర్కొన్నారు. క్లబ్ సభ్యురాలు చిలుకూరి సుబ్బాయమ్మ ఆర్థిక సహాయంతో బీసీ బాలుర వసతి గృహంలోని 45 మంది విద్యార్థులకు ఆదివారం దుప్పట్లు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్న విషయాన్ని విద్యార్థులు గుర్తించాలన్నారు. ఇష్టంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నార్నే జయలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.1.20 లక్షల విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసి యున్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన అల్లూరి విఘ్నేశ్వరరావు, మాధవి దంపతులు రూ.1,21,000ను విరాళమిచ్చారు. ఆలయ కార్యాలయంలో ఆదివారం నగదు చెక్‌ను ఈవో టి.సుధాకరరెడ్డికి దాతలు అందించారు. ఆలయ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, దాతలు విరాళాలు సమర్పించి, అభివృద్ధికి సహకారం అందించాలని ఈవో కోరారు. విరాళాలు అందజేసే దాతలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చక స్వాములు నందూరి కాళికృష్ణ, కొత్త లంక కార్తికేయ పాల్గొన్నారు.

పిట్టంబండలో పోలీస్ పికెట్



వినుకొండ(నూజెండ్ల): పిట్టంబండ గ్రామంలో వినుకొండ సి.ఐ శోభన్‌బాబు ఆధ్వర్యంలో గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఇటీవల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రంజిత్ సింగ్‌పై తెలుగుదేశం పార్టీ నాయకుడు మక్కెన స్వామి దాడిచేయడం, మళ్లీ వైఎస్సార్ సీపీ నాయకులు దాడులు చేశారనే నేపథ్యంలో కేసులు నమోదయ్యాయి. ముందస్తు చర్యల్లోభాగంగా ఎటాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

పిడుగురాళ్ల: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనటంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న శివప్రసాద్ అతని భార్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని లెనిన్ నగర్‌కు చెందిన పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఎస్ఐ మోహన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు డ్రైవర్ గౌరీనాథ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మోహన్ పేర్కొన్నారు.

ఉక్కిరిబిక్కిరి..



సీఆర్ కళాశాల ఎదురుగా జాతీయ రహదారి పక్కన వ్యర్థాల నుంచి వెలువడుతున్న పొగ

నాదెండ్ల: మండలంలోని గణపవరం గ్రామంలోని సీఆర్ కళాశాల ఎదుట గల జిల్లా పరిషత్ క్వారీ స్థలంలో తరచూ వ్యర్థాలు దహనం చేస్తున్నారు. ఈ పొగతో స్థానికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఘాటైన రసాయనాల వాసనతో కూడిన పొగ పీల్చుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు వైర్లు, ఎలక్ట్రికల్ వ్యర్థాలను ఇలా జాతీయ రహదారి పక్కన దహనం చేసి, అందులోని రాగి తీగలను విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో దట్టమైన నల్లటి, తెల్లటి పొగ జాతీయ రహదారిని కమ్మేస్తోంది. వాహన రాకపోకలకు తీవ్ర ఆటంకంతో పాటూ ప్రమాదాలకు కారణమవుతోంది.

ప్రమాదం..అనారోగ్యం

పొగ కారణంగా రహదారిపై ఎదురుగా ఉన్న వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రెండు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం పాలైన ఘటనలూ ఉన్నాయి. వ్యర్థాలు దగ్ధం చేసే వారిని స్థానికులు హెచ్చరిస్తున్నా లెక్కచేయడం లేదు. కలుషిత పొగతో స్థానికులు రోగాల బారిన పడటమేకాకుండా, పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోంది. పంచాయతీ అధికారులు, జాతీయ రహదారి పెట్రోలింగ్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

సీఆర్ కళాశాల ఎదురుగా ఉన్న క్వారీ స్థలంలో కొందరు వ్యర్థాలు తగలబెడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఇలా చేయడం చట్ట రీత్యా నేరం. స్థానికులు అలాంటి వారిని గమనించి, సమాచారమివ్వాలి. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– మారుతిబాబు, పంచాయతీ కార్యదర్శి, గణపవరం.

అనుమతివ్వండి.. సమస్యలు వివరిస్తాం



అమ్మబాబు నాయక్

వినుకొండ(నూజెండ్ల): బంజారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కమిటీ తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డీప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అపాయింట్మెంట్ ఇవ్వాలని సంఘం వినుకొండ టౌన్ ప్రెసిడెంట్ అమ్మబాబు నాయక్ కోరారు. పట్టణంలో ఆదివారం జరిగిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో నివసిస్తున్న బంజారాల స్థితిగతులు అగమ్యగోచరంగా ఉన్నాయన్నారు. బంజారాలకు రాజకీయ ప్రాధాన్యతలేకపోవడమే దీనికి కారణమన్నారు. రూ.15లక్షల బంజారాలు రాష్ట్రంలో ఉన్నా ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ గాని లేకపోవడం బాధాకరమన్నారు. తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఒక్క ప్రజా ప్రతినిధి కూడా లేరన్నారు. బంజారాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర కమిటీ తరపున లేఖ రాసి నెల కావస్తున్నా ఎటువంటి అపాయింట్మెంట్ దొరకలేదన్నారు. కార్యక్రమంలో చక్రినాయక్, రాంబాబు నాయక్, కోటేశ్వరనాయక్, రాము నాయక్, సేవా నాయక్, కొండా నాయక్, ఏడుకొండలు నాయక్, బాలాజీనాయక్, సేవానాయక్, మంత్రుల నాయక్ పాల్గొన్నారు.

జ్వరాలపై ఇంటింటి సర్వే



బ్రాహ్మణపల్లిలో ఇంటింటి సర్వేను పరిశీలించిన సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్

రాజుపాలెం: వాతావరణంలో వచ్చిన మార్పుల వలన గ్రామాలలో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఈ పరిస్థితులను నివారించేందుకు రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గ్రామాలలో జ్వరాల సర్వేను నిర్వహిస్తూ గ్రామస్తులకు అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్ శని, ఆదివారాలు గ్రామంలో ప్రతి ఇంటిని పరిశీలించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గత కొంత కాలం నుంచి గ్రామాలలో చెత్తను సేకరించే గ్రీన్ అంబాసిడర్‌లు లేకపోవడం వలన ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దుర్వాసనలు వెదజల్లడమే గాక దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆరోగ్య సిబ్బంది ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వేను చేపట్టారు. సైడు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి బ్లీచింగ్, సున్నంను చల్లుతున్నారు. సైడు కాలువల్లో దోమల లార్వాను నిర్మూలించేందుకు ఎబెట్ పిచికారీ చేస్తున్నారు. గ్రామాలలోని చేతి పంపుల నీళ్లకు పరీక్షలు నిర్వహించి కలుషితమైన చేతి పంపులను మూయించి దండోరా వేయిస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలో ఐదువేల గృహాలను సర్వే చేశారు. వరుసగా రెండు రోజులు జ్వరం వస్తే సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని మలేరియా అధికారి తెలిపారు.

ప్రధాని మోదీ ఆశయాన్ని నెరవేరుద్దాం

వెలుగు ఏపీఎం సలీం



ధ్రువీకరణ పత్రాలతో మహిళలు

అచ్చంపేట: ప్రధాని మోదీ ఆశయానికి అనుగుణంగా మహిళలను లక్షాధికారులను చేసే విధంగా లఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని స్థానిక వెలుగు కార్యాలయంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం సలీం మాట్లాడుతూ మహిళలందరినీ లక్షాధికారులను చేయడమే ప్రధాని మోదీ ఆశయమన్నారు. ఇందులో భాగంగా అచ్చంపేట మండలంలో 3,900 మంది మహిళలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎంపిక చేసిన మహిళలందరికీ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. మహిళలకు మొదటి విడతగా స్థానిక బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీపై రూ.40 వేలు ఇప్పించడం జరుగుతుందని.. ఆ రుణాన్ని సకాలంలో చెల్లిస్తే మలి విడతగా రూ.1,00,000 ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇలా సకాలంలో చెల్లించిన వారికి రుణాన్ని పెంచుకుంటూ పోవడం జరుగుతుందని చెప్పారు. మహిళలు తప్పనిసరిగా డ్వాక్రా సభ్యులై ఉండాలన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పద్మజ, సీసీ ఎస్కే సైదా, నరసింహారావు, సుభాని, అకౌంటెంట్ బాజీ, కోటేశ్వరి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి



అమరావతి: మండల పరిధిలోని లేమల్లె గ్రామంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా గౌరవాధ్యక్షుడు బంధం రావూరి శ్రీనివాసరావు ఆధర్యంలో ఆదివారం బీపీ మండల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రామ సచివాలయంలో బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బంధం రావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాబు బిందు ప్రసాద్ మండల్ బిహార్ ముఖ్యమంత్రిగా పని చేసి అణగారిన వర్గాల వారి హక్కుల కోసం పోరాటాలు చేసిన మహానుభావుడన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంట్ సభ్యుడిగా పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల నాయకులు షేక్ పీర్ సాహెబ్‌ష్ బత్తుల గోవర్ధన్, శ్రీనివాస నాయక్, గంజి శ్రీనివాసరావు, మిట్ట వెంకటేశ్వరరావు రాము నాయక్, బుల్ల రవి తదితరులు పాల్గొన్నారు

పీడిత ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన కనకాచారి

చిలకలూరిపేట: పీడిత ప్రజల హక్కుల కోసం కనకాచారి ప్రాణాలను తృణ ప్రాయంగా వదిలివేశారని పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ చెప్పారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) వ్యవస్థాపక సభ్యుడు కనకాచారి 19వ సంస్మరణ సభ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజా పోరాటాలకు అంకితమైన కనకాచారిని నాటి ప్రభుత్వం నయీం వంటి నరహంతక ముఠాతో హత్య చేయించిందని ఆరోపించారు. కనకాచారి స్ఫూర్తితో అమాయకులైన ఆదివాసిలపై జరుగుతున్న దాడులను, హత్యాకాండను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. విరసం అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ మాట్లాడుతూ దేశ వనరులు, సంపదను కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం కట్టబెట్టి దేశ ప్రజలకు తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఇలాంటి అన్యాయాలను కనకాచారి స్ఫూర్తితో అడ్డుకోవాలన్నారు. పీడీఎం నాయకులు షేక్ సత్తార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర కార్యదర్శి కె.వెంకటేష్, ఏబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు బొప్పూడి అంజమ్మ పాల్గొన్నారు.

11 మంది జూదరుల అరెస్ట్

పెదకూరపాడు: మండల కేంద్రమైన పెదకూరపాడు నుంచి గుంటూరు వెళ్లే రోడ్డులో గ్రామ పొలిమేరలో 11 మంది పేకాట జూదరులను పెదకూరపాడు పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. పెదకూరపాడు పోలీసులు తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసి 11 మంది పేకారాయుళ్లను, రూ.9,910 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి సోమవారం సత్తెనపల్లి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ బాలు నాయక్ తెలిపారు.

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వే గేటు వద్దనున్న ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో సాయికృష్ణ డెంటల్ కేర్ హాస్పిటల్ వైద్యులు పోట్ల శివరామకృష్ణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా రోజుకు రెండు సార్లు దంతాలను శుభ్ర పరచుకోవాలని సూచించారు. మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంటుందని, ప్రభుత్వ సదుపాయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలని అన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ దంత సంరక్షణ.. ఆరోగ్య రక్షణ అని చెప్పారు. విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో బీసీ బాలుర వసతి గృహ సంరక్షణ అధికారి రత్నబాబు, ఫౌండేషన్ సభ్యులు అంజి, నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరాస్వామికి జాతీయ సేవారత్న పురస్కారం

సత్తెనపల్లి: పట్టణానికి చెందిన గంజి వీరాస్వామి ఆదివారం ఒంగోలులో ఎల్‌సీఈఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సేవా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో కూచిపూడి నాట్య సమ్మేళనంలో పురస్కారం అందుకున్నారు. 23 సంవత్సరాలుగా అందిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు గాను ఈ పురస్కారానికి ఎంపికై నట్లు వీరాస్వామి తెలిపారు. ఆయనకు పానకాలు, కేశనం నాగార్జున తదితరులు అభినందనలు తెలిపారు.

సాహితీ ధృవతార బెల్లంకొండ



మాట్లాడుతున్న సి.మృణాళిని

నరసరావుపేట ఈస్ట్: తెలుగు సాహిత్యంలో నవ్య కవిత్వానికి నాంది పలికిన బెల్లంకొండ రామదాసు సాహితీ లోకానికి చిరస్మరణీయుడని సాహిత్య అకాడమీ తెలుగు సలహా సంఘం కన్వీనర్ సి.మృణాళిని పేర్కొన్నారు. ప్రకాష్ నగర్‌లోని టౌన్ హాల్‌లో ఆదివారం సాహిత్య అకాడమీ, పల్నాడు కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో బెల్లంకొండ రామదాసు శత జయంత్యుత్సవ సదస్సు నిర్వహించారు. సదస్సు ప్రారంభ సమావేశంలో పాల్గొన్న మృణాళిని మాట్లాడుతూ.. నరసరావుపేట మండలం పమిడిపాడు గ్రామంలో 1923 ఆగస్ట్ 23న జన్మించిన రామదాసు చేపట్టిన అభ్యుదయ సాహిత్య కృషిని వివరించారు. అరసం వ్యవస్థాపకుల్లో ఒకరిగా నాటి వ్యవస్థలోని అన్యాయాలను రామదాసు లోకానికి చాటారని తెలిపారు. అభ్యుదయ సాహిత్యానికి, వచన కవిత్వానికి ప్రామాణికమైన స్థానం కల్పించారని కొనియాడారు. కథ, కవిత్వం, నాటకం, అనువాద సాహిత్య ప్రక్రియల్లో రామదాసు విశేష కృషి చేశారని తెలిపారు. సదస్సులో భాగంగా పలువురు సాహితీవేత్తలు బెల్లంకొండ రామదాసు రచనలపై పత్ర సమర్పణ గావించారు. నయాగరా కవిగా బెల్లంకొండ అంశంపై పెనుగొండ లక్ష్మీనారాయణ, అనువాద నవలలపై రెంటాల జయదేవ, నాటక రచనలపై డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, మన్నే శ్రీనివాసరావు, జడా సుబ్బారావు పత్ర సమర్పణ నిర్వహించారు.

కాలువల్లో మురుగు పారాలి

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



వార్డుల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ, నాయకులు

నరసరావుపేట: మురుగు కాలువల్లో చెత్త, మొక్కలు పేరుకుపోయి కనిపిస్తే సహించేది లేదని, తక్షణమే తొలగించేలా అధికారులు రంగంలోకి దిగాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని 6, 7 వార్డుల్లోనిని కాలువల్లో పేరుకున్న చెత్తను పరిశీలించారు. అధికారులను వెంట బెట్టుకుని పరిస్థితిని సమీక్షించారు. పట్టణంలో మొత్తాన్ని ప్రక్షాళన చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని, అధికారులు కూడా అందుకు తగ్గట్లుగా సహకరించాలన్నారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించే విషయంలో ఎంతవరకైనా పోరాటం చేస్తానన్నారు. నియోజకవర్గం మొత్తాన్ని ప్రక్షాళన చేసి ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తానని, పాలన అంటే ఏంటో ప్రజలకు చూపిస్తానన్నారు. పారిశుద్ధ్య కాంట్రాక్టర్ క్రాంతికుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మతల్లికి బోనాలు



ముత్యాలమ్మతల్లి



బోనాలు సమర్పించటానికి ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

పెదకూరపాడు: మండల పరిధిలోని 75త్యాళ్లూరు శాంతికాలనీలో వేంచేసి ఉన్న ముత్యాలమ్మ తల్లికి ఆదివారం గ్రామస్తులు బోనాల సమర్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని బేడ బుడగ జంగం వారు ప్రతి ఏడాది శ్రావణ మాసంలో ముత్యాలమ్మతల్లికి బోనాలు చెల్లించడం ఆచారంగా వస్తుందని కులపెద్దలు కిన్నెర అచ్చయ్య, భిక్షాలు తెలిపారు. సంచార జీవనం సాగిస్తూ సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు కూడా ముందురోజు గ్రామానికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం గ్రామంలో అన్ని దేవాలయాలను దర్శించి పసుపు కుంకుమలు చెల్లించారు. తమ కాలనీలో వీధులను, ఇంటి ముంగిళ్లను రంగవల్లులతో అలంకరించారు. మహిళలు ప్రతి ఇంటి నుంచి బోనంతో సామూహికంగా బయలు దేరి వచ్చి ముత్యాలమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి తోడ్పాటునందించాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ. ప్రసాదరావు

అమరావతి: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలకు అడ్డంగా ఉన్న మెమో నంబర్ 1214 రద్దు చేసి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి తోడ్పాటు నందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని పల్నాడు జిల్లా భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు అన్నారు. ఆదివారం అమరావతి సీపీఎం కార్యాలయంలో అమరావతి మండల తాపీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులకు అందాల్సిన 12 రకాల సంక్షేమ పథకాలు రావటం లేదన్నారు. టీడీపీ ఎన్నికలకు ముందు భవన నిర్మాణ కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అందజేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. 60 ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పెన్షన్, వికలాంగ పెన్షన్, చదువుకోవడానికి స్కాలర్‌షిప్‌లు తదితర సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి సిలార్ మసూద్ సీఐటీయూ మండల కార్యదర్శి బి.సూరిబాబు, సయ్యద్ మొహిద్దీన్ వలీలతో పాటు మండలంలోని తాపీ మేస్త్రిలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ తిరుపతమ్మతల్లికి బోనాలు



బెల్లంకొండ: శ్రావణమాసం సందర్భంగా మండల కేంద్రంలోని యాదవుల బజారులోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో బోనాల పండుగను ఆదివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పొంగళ్లు చేసి, బోనాలను ఎత్తుకొని నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, లావణ్య దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ పాడిపంటలతో సంతోషంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ, సర్పంచ్ గడిపర్తి జ్యోతి సముద్రం, పీఎస్కే మస్తాన్ షరీఫ్, వర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.